


# రింగు



మరువ లక్ష్మీ ప్రసాద్

రంగనాథం ఈల వేసుకుంటూ బస్‌స్టాప్ దగ్గరకు వచ్చి నుంచున్నాడు. అలా వచ్చాడో, లేదో ఇలా సిటీబస్ వచ్చి ఆగింది. ఈల స్వరం తగ్గించి సంతోషంగా రద్దీగావున్న ఆ బస్సులోకి ఎలాగో జనాన్ని తోసుకుంటూ లోపలికి పోయి నుంచున్నాడు.

అలా నుంచున్న రంగనాథంకి కాలి క్రింద ఏదో గుచ్చుకున్నట్లనిపించింది. ఏమై వుంటుందబ్బా అని క్రిందికి చూసిన రంగనాథంకి పడివున్న బంగారు రింగు కనబడింది. దాని విలువ రెండొందలన్నా వుండచ్చు అనుకున్నాడు రంగనాథం. దానిని కాలితో పైకి లాగి చేతిలోకి తీసుకున్నాడు. అలా తీసుకున్న రంగనాథం న్యాయం–అన్యాయం గురించి ఆలోచిస్తున్నాడు.

న్యాయంగా బ్రతికితే మనిషికి విలువ. తోటివాళ్ళ గౌరవం లభిస్తాయి. ఇప్పుడు ఈ రింగు తిరిగి యిస్తే కండక్టర్‌గారికి నామీద మరికాస్త గౌరవం పెరుగుతుంది.



## పరిచయం

సిద్ధార్థ కళాశాలలో ద్వితీయ బి. కాం. చదువుతున్న నాకు మిని కథలు వ్రాయాలి అనే కుతూహలం కలిగించింది ఎవరో కాదు 12–12–1980 "ఆంధ్రజ్యోతి" సచిత్ర వారపత్రికలో చేసిన మీ ప్రకటన. గుంటూరు సాహితికి మినీ కథలు ఆహ్వానిస్తూ అభిప్రాయవేదికలో చేసిన ప్రకటన చూసి నా మొదటి మినీకథ "ఎందుకు వచ్చావంటే" వ్రాశాను. అది ప్రచురణకు స్వీకరించారు. "రింగు" మినీ కథ నా ద్వితీయ మినీకథ. మా నాన్నగారయిన జనార్ధనరావుగారి ప్రోత్సాహంతోనే ఈ కథ వ్రాయటం జరిగింది. 'ఆంధ్రభూమి'లో వరుసగా నాలుగు అయిదు వారపత్రికలలో నా పేరు మీద జోకులు వెలువడ్డాయి. ఇంతకుమించి అభివృద్ధి చెందలేదు మరి.

— ఎమ్. లక్ష్మీప్రసాద్




అంతేకాదు మర్నాడు పేపర్లలో ఓ పక్క "న్యాయమైన మనిషి" అని పెద్ద పెద్ద అక్షరాలతోవేసి నా గురించి వ్రాస్తారు. అందరూ చదివి నన్ను గొప్పగా పొగడుతారు అనుకున్నాడు రంగనాథం. మొత్తం మీద న్యాయంవైపే ఎక్కువ మక్కువ చూపాడు నాథం.

ఓ నిర్ణయానికి వచ్చిన రంగనాథం "కండక్టర్, కండక్టర్" అని గట్టిగా అందరికీ వినపడేలా పిలిచాడు.

కండక్టర్‌కి చేతిలోని రింగు అతనికిస్తూ, "ఎవరిదో పడిపోయింది....ఎవరు పారేసుకున్నారో పాపం" అందరికీ విన

పడేలా మరికొంచెం గట్టిగా అన్నాడు.

రంగనాథం మాటలు విన్న ఆడవాళ్ళందరూ తమ చెవులను చూసుకున్నారు. కాని ఎవరివీ ఏమీ పోలేదు. కండక్టర్ కూడా అందరినీ అడిగి చూశాడు. ఎవరూ కూడా ఏమీ పారేసుకోలేదు.

బహుశా ఇది ఇంతకుముందు ట్రిప్పులోది అనుకుంటూ "సార్ ఇంతకుముందు ట్రిప్పులో పారేసుకు నుంటార్లెండి" అని జేబులో వేసుకున్నాడు కండక్టర్.

రంగనాథం నిజాయితీ గురించి బస్‌లో తలావొకరు తలొక విధంగా పొగిడేశారు. ఆడవాళ్ళ సీట్లో కూర్చున్న ఒక ముసలామె "అబ్బాయ్ మనదేవూరు" అని అడిగింది.

రంగనాథం మర్యాద ఒలకబోస్తూ "కాటూరండీ"

"మంచి నిజాయితీగల మనిషివి బాబూ. ఈ రోజుల్లో ఎవరుంటారు బాబూనీలాంటి వాళ్ళు. దొరికిందే సందు అని జేబులో వేసుకుంటారు. నీకు మంచి జరగాలి నాయనా" అని దీవించింది ఆ ముసలమ్మ.

రంగనాథం నిజాయితీ గురించి బస్‌లో పొగడని వ్యక్తిలేడు. ఆ మాటలు విని మరీమరీ మురిసిపోయి తన నిజాయితీని తనే మనస్సులో పొగుడుకుంటున్నాడు.

బస్‌దిగి హుషారుగాఆఫీసులోకి పోయి తన సీట్లో కూర్చున్నాడు. తన నిజాయితీని తన ప్రక్కనున్న రాజుకి, చంద్రంకి, సుబ్బరాజుకి చెప్పి పొగిడించుకుని సంతోషపడ్డాడు రంగనాథం.

*　　*　　*

"సార్.... మీకు ఫోన్ వచ్చింది" ప్యూను వచ్చి చెప్పాడు రంగనాథంకి.

"నాకా.... ఫోనా" అన్నాడు ఆశ్చర్యంగా ఎప్పుడూ,ఎవరూ తనకు ఆఫీసుకి ఫోన్ చేసేవారు లేని రంగనాథం.

"అవును సార్ మీకే. మీ పేరు చెప్పారు."

కంగారుగా ఫోను ఎత్తాడు. అవతలనుంచి— "ఏవండీ నేను రాజ్యంని మీకు ఉదయం చెప్పడం మర్చాను. ఆఫీసుకు బయల్దేరేటప్పుడు మనమ్మాయి రింగు మీ జేబులో పెట్టాను. ఆ రింగు అమ్మాయి చెవికి సరిగా పట్టడంలేదు. జాగ్రత్తగా దగ్గరుండి బాగు చేయించుకుని రండి.... ఇందుకే ఫోను చేశాను కంగారుపడకండి" అని ఫోన్ పెట్టేసింది రాజ్యం.

ఖంగుతిన్నాడు రంగనాథం భార్య మాటలు విని. ●

ఆంధ్రజ్యోతి
సచిత్ర వార పత్రిక

# విజయదశమి నవలల పోటీ

తెలుగులో మంచినవలలు రావాలనే ఆసక్తితో పాఠకుల సౌకర్యార్థం నవలలపోటీని నిర్వహిస్తున్నామని తెలియజేయడానికి సంతోషిస్తున్నాం. లబ్ధప్రతిష్ఠులతోపాటు కొత్తతరంకూడాఉత్సాహంతో పాల్గొని మా ప్రయత్నాన్ని విజయవంతం చేస్తారని ఆశిస్తున్నాం.

## మొత్తం బహుమతుల విలువ రు. 10,000

మొదటి బహుమతి రూ. 5000/-
రెండవ బహుమతి రూ. 3000/-
మూడవ బహుమతి రూ. 2000/-

నిబంధనలు :

1. పోటీకి పంపే నవలలు ఫుల్‌స్కేప్ సైజు కాగితాలలో 150, 200 పేజీల మధ్య. 200 పేజీలకు మించకుండా వుండాలి.
2. కాగితానికి ఒకపక్కనే సిరాతో స్పష్టంగా రాయాలి.
3. తెలుగువారి జీవితానికే ప్రాధాన్యం యివ్వాలి. ఎన్నికలో పాఠకుల అభిరుచిని కూడా దృష్టిలో వుంచుకోడం జరుగుతుంది.
4. అనువాదాలు, అనుకరణలు పంపకూడదు.
5. మొదటి బహుమతికి యోగ్యమైనవి లేవనుకున్నప్పుడు ఆ బహుమతిని రద్దుచేసే హక్కు మాకు వుంటుంది.
6. బహుమతి పొందినవిగాక మరికొన్ని నవలలను సాధారణ ప్రచురణకు స్వీకరించే అవకాశం వుంది.
7. కవరుపైన 'విజయదశమి నవలల పోటీ'కి అని స్పష్టంగా రాయాలి.
8. అంగీకరించనివాటిని తిప్పి పంపడానికి వీలుగా తగినంత పోస్టేజి అతికించిన చిరునామావున్న కవరు విధిగా రచనతోపాటు జతచేసి పంపాలి.
9. నవలలపోటీ ఫలితాలు 5—11—82 సంచికద్వారా ప్రకటిస్తాము. నవలల ప్రచురణ వివరణకూడా అందులో ప్రకటిస్తాము. బహుమతుల విషయమై ఎటువంటి ఉత్తర ప్రత్యుత్తరాలకీ వీలుండదు.
10. నవలల ఎన్నికవిషయంలో తుదినిర్ణయం సంపాదకునిదే. మీ నవలను :

ఎడిటర్,
ఆంధ్రజ్యోతి సచిత్ర వార పత్రిక,
పోస్టు బాక్సు నెం. 712,
విజయవాడ-520 010కి పంపాలి.

నవలలు మాకు చేరవలసిన ఆఖరుతేదీ: 31-8-1982

—ఎడిటర్